సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం | 24 | మార్చి | 2023



సక్రమమార్గంలో నడుచుకుంటూ, దేవునియందు భక్తి విశ్వాసం కల వారికి వారి కర్మానుసారం మంచి జీవితం లభిస్తుంది. – మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:32	శని: 4:51

రంజాన్ వేళలు

..మీరే సాక్షి

- 15 ఏళ్లుగా 'సాక్షి' అలుపెరగని పోరాటం
- అనేక సమస్యలకు పరిష్కారం
- మరెన్నో వెలుగులోకి తెచ్చిన వైనం
- నేడు 16వ వసంతంలోకి అడుగు

తెలుగు నేలపై చెరగని సంతకం 'సాక్షి'. పాఠకులను గుండెలకు హత్తుకుంటూ.. శుభోదయం చెబుతూ.. తన పయనం సాగిస్తోంది. వార్తలు.. వాస్తవాల ఆవిష్కరణలతోనే సామాజిక బాధ్యతలను భుజాన వేసుకుంది. 'సాక్షి' అక్షర సేద్యం మొదలై నేటితో పదిహేనేళ్లు పూర్తి. నిజాలను నిక్కచ్చిగా చెప్పడంలోనూ.. అభాగ్యులకు అండగా నిలవడంలోనూ ముందుంది. బాధితులకు అండగా నిలిచి బతుకుపై భరోసా కల్పించడంలోనూ నేనున్నానంటూ తోడుగా నిలబడింది. అవినీతి.. అక్రమాలపై అక్షర సమరం చేసింది. కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న వారి దీనగాథలను ఆపన్నుల దృష్టికి తీసుకెళ్లి సాయం అందించడంలో తన చేయి నందించింది. ప్రజల ఇబ్బందులపై అక్షరాలను ఆయుధాలుగా మలుచుకుని నిత్యం కథనాలు అందిస్తున్న 'సాక్షి'తో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. అధికారుల స్పందనతో మరెన్నో ఇక్కట్లు తొలగాయి. సాక్షి పుట్టుక నుంచి వివిధ సమస్యలపై సాగించిన అక్షరపోరాటంలోని కొన్ని కథనాలు.. ప్రజలకు దూరమైన సమస్యలను ఒకసారి పరిశీలిస్తే..!!

న్యూస్‌రీల్

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం


మాట్లాడుతున్న మక్కాన్ సింగ్

జ్యోతినగర్: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీల్లో ఖాళీ స్థలాలు కేటాయించాలని పేదలు చేస్తున్న నిరసనకు గురువారం మద్దతు తెలిపారు. న్యూపీకేరామయ్యకాలనీ, ఇందిరమ్మకాలనీలో నిరాశ్రయులైన వారికి ప్రభుత్వ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

అధికారంలోకొస్తే రుణమాఫీ

గోదావరిఖని: కాంగ్రెస్ అధికారంలోకొస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. హాథ్ సేహాథ్ జోడోయాత్రలో భాగంగా పవర్‌హౌస్‌కాలనీ ప్రాంతంలో పర్యటించారు. బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసుగుచెందుతున్నారన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో బీసీ కుటుంబాలకు అన్యాయం జరిగినా ఎమ్మెల్యే స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ కాల్వ లింగస్వామి, నాయకులు ఎండీ.ముస్తాఫా, మహంకాళీ స్వామి, మారెల్లి రాజిరెడ్డి, చుక్కల శ్రీనివాస్, వీరబోయిన రవియాదవ్, పెండ్యాల మహేశ్, ధూళికట్ట సతీశ్, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

'పది' హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను శుక్రవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో మాధవి తెలిపారు. ఏప్రిల్ 3నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థులు bre.tealngana.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు.

విధి నిర్వహణలో క్రమశిక్షణ అవసరం


మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

మంథని: క్రమశిక్షణగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సీపీ రెమా రాజేశ్వరి సూచించారు. గురువారం పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్‌తో కలసి మంథని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఫిర్యాదులపై స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీసీ కెమెరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, కేసుల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, మంథని సీఐ సతీశ్, మంథని, ముత్తారం ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాములు ఉన్నారు.

ఫ్లోరైడ్ రక్కసిపై పోరు



గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండల కేంద్రానికి కిలోమీటర్ దూరం కూడా లేని ఊరు గుంజపడుగు. ఈ గ్రామస్తులు కొన్నేళ్లుగా ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందిపడుతున్నారు. ఆ నీటిని తాగి జీవశ్ఛవాలుగా, వికలాంగులుగా, కిడ్నీ, కీళ్ల నొప్పుల బారిన పడి అల్లాడుతున్నారు. వారి బాధలు కళ్లకు కట్టేలా 'సాక్షి'లో 'కబలిస్తున్న ఫ్లోరైడ్ రక్కసి' శీర్షికన కథనం ప్రచురితమైంది. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించలేదు. కానీ.. ఓ వైద్యుడు చలించిపోయాడు. జగిత్యాలకు చెందిన వైద్యుడు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తుల బాధలు నేరుగా చూసి ఫ్లోరైడ్ రహిత నీటిని అందిస్తానని హామీ ఇచ్చాడు. ఓ స్వచ్ఛంద సేవ సంస్థతో కలిసి తనవంతు ఆర్థికసాయం అందజేశాడు. మూడునెలల్లో పనులు పూర్తి చేయించి వాటర్ ప్లాంట్ ప్రారంభించారు.

'సాక్షి'కి ధన్యవాదాలు



మా గ్రామంలో ఉన్న సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. ప్రధానంగా ఫ్లోరైడ్ సమస్యపై కథనం రాయగా ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి సారు స్పందించి వాటర్ ప్లాంట్‌కు ఆర్థికసాయం చేశారు. ఇప్పుడు ఆ నీళ్లే తాగుతున్నాం. మా గ్రామస్తుల తరఫున 'సాక్షి'కి ధన్యవాదాలు.

– అంజి, గుంజపడుగు

మెప్మా కుంభకోణంపై చర్యలు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగర పాలక సంస్థ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో నకిలీ సంఘాలను సృష్టించి కోట్లాది రూపాయలు రుణాలు తీసుకుని సొంతఖాతాలోకి మళ్లించుకున్న వైనంపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురించాం. దీనిపై స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. వీటితో పాటు నకిలీ సంఘాల పేరుతో రుణాలు తీసుకున్న వారిపై పోలీస్‌స్టేషన్ కేసు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో పాలు పంచుకున్న వారిని మెప్మా నుంచి తొలగించారు.

ప్రాణం పోసిన 'సాక్షి'



వీణవంక: తెలంగాణ ఉద్యమ సమయంలో ధూంధాం కళాకారులతో కలిసి ఆటపాటలతో ఉర్రూతలూగించిన వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల రమేశ్‌కు మెదడులో రక్తస్రావం జరిగింది. ఆపరేషన్‌కు రూ.13 లక్షలు అవసరం అయ్యాయి. కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. అప్పు పుట్టే పరిస్థితి లేదు. ఆపరేషన్ చేయించే స్థోమత లేదు. ఈ క్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు 'సాక్షి'ని ఆశ్రయించారు. 2019 సెప్టెంబర్ 21న సాక్షిలో 'పేద కళాకారుడికి పుట్టెడు కష్టం' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దేశవిదేశాల నుంచి దాతలు స్పందించారు. రూ.10 లక్షలకు పైగా సమకూరాయి. ఆపరేషన్ చేసుకున్న రమేశ్ ఇప్పుడు కుటుంబంతో జీవిస్తున్నాడు.

బతుకుత అనుకోలే..



ధూంధాం కళాబృందంలో పోతురాజు వేషం వేసేవాడిని. హఠాత్తుగా మెదడులో రక్తస్రావమై పక్షవాతం వచ్చింది. ఆస్పత్రిలో చేరితే రూ.13లక్షలు అవుతాయని వైద్యులు చెప్పారు. నా భార్య రజిత దిక్కుతోచని స్థితిలో పడింది. ఇక బతుకనని అనుకున్న. ఇంతలో మా ఊరోళ్లు 'సాక్షి'ని సంప్రదించుమని చెప్పారు. నా గురించి 'సాక్షి'లో రాశారు. రూ.10 లక్షలకు పైగా దాతలనుంచి సాయం వచ్చింది. ఆపరేషన్ అయ్యింది. 'సాక్షి' నాకు ప్రాణం పోసింది. లేకుంటే బతికెటోన్ని కాదు.

– గోనెల రమేశ్, మల్లారెడ్డిపల్లి

'సాక్షి' కథనంతో చిన్నారులు భద్రం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఈ ఏడాది ఫిబ్రవరిలో కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు కాదాసి అక్షిత (11), మిడిదొడ్డి లోకేశ్ (09)ను అదే కాలనీలో నివసించే మహిళ చాక్లెట్ల ఆశచూపి కిడ్నాప్ చేసింది. చిన్నారులను కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి ఔరంగాబాద్‌కు తీసుకెళ్లింది. రైలులో పిల్లలు ఏడుస్తున్నారని రక్తం వచ్చేలా చితకబాదింది. ఔరంగాబాద్ చేరుకోగానే పిల్లల గాయాలు చూసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌లోని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. చిన్నారుల తల్లిదండ్రుల ఇద్దరు నిరక్షరాస్యులు కావడంతో భాష సమస్య తలెత్తింది. వెంటనే రంగంలోకి దిగిన 'సాక్షి' అధికారులు, తల్లిదండ్రుల మధ్య సంధానకర్తగా వ్యవహరించింది. పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించే న్యాయ ప్రక్రియలో రెండురోజుల పాటు దుబాసీగా వ్యవహరించింది. ఫలితంగా అక్కడి అధికారులు పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ తరువాత చిన్నారులు క్షేమంగా కరీంనగర్‌కు చేరుకున్నారు. ఓ వైపు చిన్నారుల తల్లిదండ్రులకు సహాయపడుతూనే మరోవైపు ఈ కిడ్నాప్ ఉదాంతం వరుస కథనాల ప్రచురించింది. దీంతో స్పందించిన పోలీసులు మహిళపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

'సాక్షి' కన్నపేగును కాపాడింది



మా పిల్లలను పొరుగింటి మహిళ కిడ్నాప్ చేసిందని వెంటనే గుండె ఆగినంత పనైంది. అభం శుభం తెలియని చిన్నారులు మహారాష్ట్ర రైల్వే పోలీసులకు చిక్కారని తెలియగానే కంగారు పడ్డాం. కానీ 'సాక్షి ప్రతినిధి' మాకు మహారాష్ట్ర చిల్డ్రన్ ప్రొటెక్షన్ అధికారులకు మధ్యగా సంధానకర్తగా వ్యవహరించి పిల్లలను క్షేమంగా విడిపించారు. 'సాక్షి' కథనాలతో పోలీసులు కిడ్నాప్‌నకు పాల్పడిన మహిళపై కేసు పెట్టారు. సాక్షి చొరవే మా కన్నపేగును కాపాడింది.

– సరిత, చిన్నారి తల్లి

ఇటుకబట్టీల్లో అక్షరవెలుగు



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా అంటే ఇటుక బట్టీలకు కేరాఫ్. ఆయా ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికుల పిల్లల చదువులపై 'బట్టీల్లో మొక్కుబడి'..?' శీర్షికన వారి సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో అప్పటి డీసీపీ రూపేష్ స్పందించి 'ఆపరేషన్ ధృవ' పేరుతో ఇటుకబట్టీల్లో డిజిటల్ పాఠశాలలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి ఇటుక బట్టీల్లో వారి ప్రాంతానికి చెందిన టీచర్లతో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకున్నారు.

మా పిల్లలు చదువుకుంటున్నారు



ఉపాధికోసం ఒడిశా నుంచి వలస వచ్చి భార్యపిల్లలతో సుల్తానాబాద్ ఇటుకబట్టీలో పనిచేస్తున్నాం. పిల్లల చదువు గురించి పెద్దగా పట్టించుకోలేదు. 'సాక్షి' పేపర్‌లో మా వలస కార్మికుల పిల్లల చదువులపై రాసింద్రు అని అప్పటి డీసీపీ సారు బట్టీల్లో స్కూళ్లు ఏర్పాటు చేయించిండు. ఇప్పుడు మా పిల్లలతో పాటు మిగితా పిల్లలు పనిలోకి రాకుండా బడికిపోయి చదువుకుంటున్నారు.

– తులసీరాంనాగ్, వలస కార్మికుడు

మంథని సమస్య.. జిల్లావ్యాప్తంగా పరిష్కారం



మంథని: పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో అన్నదాతలు ఇబ్బంది పడ్డారు.ఈ స్తంభాల పరిస్థితిపై 2010 జూన్, జూలై మాసాల్లో 'సాక్షి' వరుస కథనాలిచ్చింది. ఎన్‌పీడీసీఎల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లింది.అప్పటి మంథని డీఈఈ ఈశ్వరప్రసాద్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఒరిగిన స్తంభాలను సరిచేసే కార్యక్రమానికి 2013మార్చి 22న శ్రీకారం చుట్టారు. పనులను ఎస్ఈ రాంమోహన్‌రావు పరిశీలించి సమస్య ఉన్నచోట జిల్లాలోని అన్ని ప్రాంతాలకు విస్తరించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నూతనంగా 47 వేల స్తంభాలు అమర్చారు.

బొగ్గుదందాకు చెక్

సాక్షి, పెద్దపల్లి: గోదావరిఖనిలో సింగరేణి నుంచి అక్రమంగా బొగ్గు రవాణాపై '100 కోట్ల బొగ్గుదందా' శీర్షికన 2016లో మొదటిసారిగా వెలుగులోకి తీసుకొచ్చింది.దందా సాగుతున్న వైనం, అందులో ఉన్న దళారులపై వరుస కథనాలు ప్రచురించింది. అప్పటి ఎస్పీ వారియర్ స్పందించి బొగ్గుదందాపై ఉక్కుపాదం మోపి సింగరేణికి నష్టం వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి దందాకు చెక్ పడింది.

క్రీడారంగానికి దిక్సూచి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ క్రీడారంగానికి 'సాక్షి' దిక్సూచిగా మారింది. 15 ఏళ్లుగా క్రీడారంగంలో ప్రారంభం కాని ఎన్నో కార్యక్రమాలకు 'సాక్షి' కథనాలు ముందడుగు వేశాయి. 2005లో అంబేద్కర్ స్టేడియంలో తాత్కాలికంగా ప్రారంభించిన ప్రాంతీయ క్రీడాపాఠశాలను 2019లో లోయర్ మానేరు కిందకు సొంత భవనాల్లోకి మారడంలో 'సాక్షి' కథనాలే ప్రధాన కారణం.2020లో కరీంనగర్‌కు మంజూరైన సెట్విన్ సెంటర్‌ను రెండేళ్లకు 'సాక్షి' కథనంతో ప్రారంభించారు. దీంతో వేలాది మంది యువతకు శిక్షణ కల్పించినట్లయ్యింది.

దళితులపై పోలీసుల థర్డ్ డిగ్రీ

సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల దళితులపై పోలీసులు 2017 జూలై 14న థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఈ ఘటనపై 'సాక్షి' 'దళితులపై థర్డ్ డిగ్రీ' అనే కథనాన్ని ప్రచురించింది. జిల్లెల్ల వద్ద జూలై 2న ఇసుక లారీ ఢీకొని బదనపురం భూమయ్య మరణించాడు. గతంలో ఇలాంటి ఘటనలు జరగడంతో ఆగ్రహించిన స్థానికులు ఐదు ఇసుక లారీలకు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 13 మందిపై కేసు పెట్టిన పోలీసులు పెంట బానయ్య, కోల హరీశ్, చెప్యాల బాలరాజు, పసుల ఈశ్వర్, గంధం గోపాల్, బత్తుల మహేశ్‌ను నిర్బంధించిన థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. దీనిపై 'సాక్షి'లో కథనం రావడంతో పార్లమెంట్ స్పీకర్ మీరాకుమార్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నేరెళ్లకు వచ్చి బాధితులను పరామర్శించారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు నేరెళ్లకు వచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఎస్పీ విశ్వజిత్ కంపాటిని బదిలీ చేశారు.

'సాక్షి' ఫొటో కుటుంబాన్ని కలిపింది


సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరుకు చెందిన మినప ఎల్లయ్య 2006లో దుబాయ్ వెళ్లేందుకు రూ.50వేలు అప్పు చేసి ఏజెంట్ చేతిలో పెట్టి మోసపోయాడు. స్వగ్రామానికి రావడం ఇష్టం లేక వెంకటాపూర్‌లోని కూతురు వద్దకు వెళ్లాడు. ఒకరోజు కనిపించకుండా పోయాడు. భార్య కేశవ్వ, కుమారులు దేవరాజు, శ్రీనివాస్ బంధువుల ఇళ్లు, తెలిసిన చోట ఏడాదిపాటు వెతికినా.. ఆచూకీ లభించలేదు. 2009 మార్చిలో నిజామాబాద్ జిల్లా వర్ని నుంచి వ్యవసాయ కూలీలకు సంబంధించిన కథనం 'సాక్షి'లో ప్రచురితమైంది. సాక్షిలో వచ్చిన ఫొటోను గూడూరు సర్పంచ్ చీటి వెంకటనర్సింగారావు చూశారు. ఆయనను ఎల్లయ్యగా గుర్తించి ఆయనకు వైద్యం చేయించి స్వగ్రామానికి తీసుకొచ్చారు. 'సాక్షి' దినపత్రికలో కథనంతో ఇంటి పెద్దదిక్కును కుటుంబ సభ్యుల చెంతకు చేర్చింది. తమ కుటుంబ పెద్దను తమ వద్దకు చేర్చిన సాక్షికి జీవితాంతం రుణపడి ఉంటామని ఎల్లయ్య భార్య కేశవ్వ, కుమారులు దేవరాజు, శ్రీనివాస్ పేర్కొన్నారు.


కొడుకు కోడలు, మనుమడితో ఎల్లయ్య

బొమ్మలమ్మగుట్టకు తప్పిన గ్రానైట్ గండం

గంగాధర: శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న గంగాధర మండలంలోని కురిక్యాల, కొండన్నపల్లి గ్రామశివారులోని బొమ్మలమ్మగుట్టపై 13ఏళ్ల క్రితం గ్రానైట్ వ్యాపారులు కన్ను వేశారు. దాదాపు 9 మంది వ్యాపారులు గ్రానైట్ రాయి తీసుకెళ్లడానికి దరఖాస్తు చేసుకున్నారు. మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్‌క్వారీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేందుకు సిద్ధం అయ్యారు. ఈ విషయమై గ్రానైట్ తీయవద్దని కురిక్యాల, కొండన్నపల్లి యువకులు బొమ్మలమ్మగుట్ట చరిత్రను వివరిస్తూ పురావస్తు, పర్యాటక, మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వినూత్న నిరసనలకు కర్ణాటక ప్రభుత్వం సైతం మద్దతిచ్చింది. అప్పుడే పురుడు పోసుకున్న 'సాక్షి' దినపత్రిక గుట్ట చరిత్రపై వరుస కథనాలు ప్రచురించింది. ప్రభుత్వం సైతం పర్యాటకప్రాంతంగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన జీవో నంబరు 13/2011 విడుదల చేసింది.

'సాక్షి'కి సలాం



బొమ్మలమ్మగుట్ట గ్రానైట్ వ్యాపారుల పరం కాకుండా ఉండటానికి 'సాక్షి' వరుస కథనాలు ఇచ్చింది. అవే మా ఉద్యమానికి ఊపిరయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం గ్రానైట్ వ్యాపారుల దరఖాస్తును రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని చాలాబాగా అభివృద్ధి చేస్తున్నారు.

– లింగయ్య, బొమ్మలమ్మగుట్ట పరిరక్షణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

ధైర్యం కోల్పోకండి.. ఆదుకుంటాం!

- జిల్లా రైతులకు సీఎం కేసీఆర్ భరోసా
- అండగా ఉండాలని వేడుకున్న రామడుగు రైతులు
- ప్రతీ ఎకరాకు రూ.10వేలు ఇస్తామని సీఎం ప్రకటన
- జిల్లాలో దాదాపు 23వేల ఎకరాలకు.. రూ.23 కోట్ల పరిహారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/రామడుగు: అకాల వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులెవరూ అధైర్యపడవద్దని సీఎం కేసీఆర్ అన్నారు. వరంగల్ నుంచి నేరుగా రామడుగు లక్ష్మీ పంప్‌హౌజ్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద సీఎం దిగారు. అక్కడ నుంచి లక్ష్మీపూర్, రామచంద్రపూర్‌లో పర్యటించారు. లక్ష్మీపూర్‌లో రైతు దేవా రామచంద్రారెడ్డి వేసిన మస్క్‌మిలాన్, డ్రాగన్‌ఫ్రూట్ పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు ముఖ్యమంత్రితో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తమ ప్రాంతంలో తీవ్ర కరువు, కాటకాలు ఉండేవని, ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడేటివి కాదని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు పుష్కలమైన నీటి సదుపాయాలు సమకూరడంతో భూగర్భ జలాలు దండిగా పెరిగాయన్నారు. కేవలం 8 నుంచి 10 మీటర్ల లోతులో నీరు వస్తుందన్నారు. కరెంటు, నీరు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. ఈసారి పంట నష్టంపోయి తనకు దాదాపు నష్టం వచ్చినా.. తానేం అధైర్యపడడం లేదని అన్నారు. 'సీఎం సార్ మీరే మా ధైర్యం దయచేసి మమ్మల్ని ఆదుకోండి సార్' అని రైతు వేడుకున్నాడు. అనంతరం సీఎం సమీపంలోని మామిడి రైతు ఎడవెల్లి రాజిరెడ్డి తోటకు వెళ్లారు. రాలిపోయిన మామిడి నష్టంపై ఆరా తీశారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఎడారి, వలసల ప్రాంతం

సమైక్యపాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరువు కాటకాలు ఉన్నాయని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. చొప్పదండి ప్రాంతం కూడా ఎడారిలా ఉండేదని, రైతులంతా బతుకుదెరువుకోసం వలసలు వెళ్లేవారని గుర్తుచేశారు. అందుకే, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకుని, కాలువలు నిర్మించుకుని ఆ ప్రాంతాన్ని పచ్చగా చేసుకున్నామన్నారు. తాను వస్తుంటే లక్ష్మీ పంప్ హౌజ్ కాలువలకు రైతులు పెట్టుకున్న మోటార్ల పంపులు చూసి సంతోషించామన్నారు. వీటి ద్వారా కాలువకు ఎగువ నేలల్లో ఉన్న పంటలకు సైతం నీరందుతోందని హర్షం వ్యక్తం చేశారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని అందుకే, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. ఎకరాకు రూ.10వేల చొప్పున పంట సాయం ప్రకటించారు. కాగా జిల్లాలో దాదాపు 23వేల ఎకరాల్లో పంట నష్టం జరగగా.. రూ.23 కోట్ల మేరకు నష్టపరిహారం అందనుంది. కాగా.. వడగండ్ల వర్షంతో లక్షలాది రుపాయల పంటలు నష్టపోతే సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.పదివేలు పరిహారం అందజేస్తామని ప్రకటించడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, చిత్రంలో మంత్రులు, అధికారులు

పోలీసులపై మంత్రి అసహనం..

సీఎం పర్యటన సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ పోలీసులపై అసహనం ప్రదర్శించారు. సీఎం పర్యటనకు ముందుగానే మధ్యాహ్నం మంత్రి గంగుల కాన్వాయ్ రామడుగు చేరుకుంది. అయితే, గంగుల కాన్వాయ్‌కు దారి చూపేందుకు పైలెట్ వాహనం రాలేదు. ఈ విషయం పోలీసులకు తెలిపినా.. వారు వాహనం సమకూర్చలేకపోయా రు. పంప్‌హౌజ్ గెస్ట్ హౌజ్ చేరుకున్నాక.. మంత్రి రామడుగు పోలీసులపైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కుల సంఘాల భవనాలకు నిధులు



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): మండలంలోని వివిధ గ్రామాల్లో కుల సంఘాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను ఆయా గ్రామాల కులసంఘాల సభ్యులకు రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం అందజేశారు. మల్లాపూర్‌లో మాల, మాదిగ కుల సంఘాల భవనాలకు రూ.5 లక్షల చొప్పున, న్యూ కొత్తపల్లిలో మున్నూరు కాపు భవన మిగులు పనులకు రూ.5 లక్షలు, అబ్బాపూర్‌లో యాదవ సంఘం, రెడ్డి సంఘం, మహిళా సంఘం భవనాలకు రూ.5 లక్షల చొప్పున, కొత్తపల్లిలో నాయక సంఘం భవన నిర్మాణ మిగులు పనులకు రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ధర్మారం మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు 9 నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న కావేటి రాజ్‌గోపాల్

పెద్దపల్లిరూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలకు గురువారం 9 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల అధికారి (జిల్లా సహకారశాఖ అధికారి) మైఖేల్ బోస్ అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. వాటిని శుక్రవారం పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీలో 191 మంది సభ్యులుగా ఉన్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిలో పలువురిని చైర్మన్, ఇతర పదవులకు ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు.

పెరుగుతున్న టీబీ కేసులు..!

- 2022లో మొండి కేసులు 54
- 2023లో ఇప్పటివరకు 8 మంది బాధితులు
- పౌష్టికాహారానికి రూ.500
- నేడు టీబీ నివారణ దినోత్సవం



టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అధికారులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలో టీబీ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. వాతావరణంలో మార్పులు, కాలుష్యం, పొగాకు సేవనం వదలని వారు దీని బారిన పడుతున్నారు. ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు చేపడుతున్నా సమూలంగా అంతం కావడం లేదు. 15 ఏళ్లలోపు పిల్లలు 32 మందికి గతేడాది వ్యాధి సోకడం ఆందోళన కలిగించే అంశం. ఈ ఏడాది ఇప్పటివరకు ముగ్గురికి సోకినట్లు తేలడం పరిస్థితికి అద్దం పడుతోంది.

టీబీ రెండు రకాలు

టీబీని రెండు రకాలుగా పరిగణిస్తారు. ఒకటి డ్రగ్ సెన్సిటివ్‌లో ఆరు నెలలు, రెండోది డ్రగ్ రెసిస్టెంట్ ఏడాదిన్నర మందులు పంపిణీ చేస్తారు. ఇళ్లల్లో ఐదేళ్ల లోపు పిల్లలు ఉంటే ముందస్తుగా ఐసోనియాజిడ్ మందులు ఇస్తారు. తమ ప్రాంతంలోని వారికి తెలుస్తుందనే కారణంతో చాలాచోట్ల ప్రభుత్వం అందించే రూ.500 పారితోషికం తీసుకునేందుకు రోగులు వెనకాడుతున్నారు. రోగులకు దాతల సహకారంతో పౌష్టికాహారం అందిస్తున్నారు.

పీహెచ్‌సీల వారీగా పరీక్షలు

జిల్లాకేంద్ర ఆస్పత్రితోపాటు గోదావరిఖని, మంథని సీహెచ్‌సీ, 22 ప్రాథమిక, అర్బన్ ప్రాథమిక కేంద్రాల్లో నిత్యం తెమడ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నియంత్రణకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు సిద్ధం చేసింది వైద్య శాఖ. దీర్ఘకాలిక రోగుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వ్యాధికి అడ్డుకట్ట వేసేందుకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

వ్యాధి సోకినవారికి దూరంగా ఉండాలి

టీబీ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. వ్యాధి సోకినవారికి దూరంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. తుంపర్ల ద్వారా సోకుతుంది కాబట్టి రోగులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయరాదు. మాట్లాడేటప్పుడు తప్పనిసరిగా చేతి రుమాలుగానీ, మాస్క్ గానీ ధరించాలి. కుటుంబసభ్యులు దూరంగా ఉంటే మంచిది.

జిల్లాలో రోగుల వివరాలు

ఏడాది	టీబీ రోగులు
2018	820
2019	880
2021	920
2022	1291
2023(ఇప్పటివరకు)	235

టీబీ రహితంగా మారుస్తాం



2025 వరకు జిల్లాను టీబీ రహితంగా మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలి. లక్షణాలున్న వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. రూ.లక్షల విలువ చేసే మందులను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. వినియోగించుకుంటే వ్యాధి తప్పకుండా నయమవుతుంది.

– డాక్టర్ సుధాకర్ రెడ్డి, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి

వ్యాధిని నియంత్రిద్దాం

పెద్దపల్లిరూరల్: ప్రజల్లో అవగాహన పెంచేలా కార్యాచరణ చేపట్టి క్షయను నియంత్రిద్దామని కలెక్టర్ సంగీత అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఇతర అధికారులతో కలసి పోస్టర్ ఆవిష్కరించారు. టీబీ లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామ, వార్డుస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి, రామగుండం, మంథని, సుల్తానాబాద్, కాల్వ శ్రీరాంపూర్‌లో క్షయవ్యాధికి వైద్యసేవలందిస్తున్నామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. పోషక విలువలున్న చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో పోషణపక్షం పోస్టర్‌ను సంక్షేమ అధికారి రవుఫ్, డీఈఓ మాధవితో కలిసి ఆవిష్కరించారు. ఏప్రిల్ 3వరకు జరిగే పోషణపక్షం కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలి



కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. గురువారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం జరిగిన కాగడాల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ స్వేచ్ఛ, స్వాతంత్య్రం కోసం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ వీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్), ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మాట్లాడారు. దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు, మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత పోరాడాలని సూచించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో అధికార పార్టీకి చెందిన పెద్దలు ఉన్నారన్నారని ఆరోపించారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు బాధ్యత వహించాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి చిలుక శంకర్, పీవైఎల్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కుమార్, మహేందర్, మల్లేశ్, సత్యం, సంపత్, యాదగిరి, రమేశ్, జి.రాజయ్య పాల్గొన్నారు.

మోసపోతే గోస పడుతాం

- ఎన్నికల వేళ వచ్చే నాయకులను నమ్మొద్దు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గోదావరిఖని: ఎన్నికలు వస్తున్నాయని ఇంటికొచ్చే నాయకులను నమ్మి మోసపోతే ఐదేళ్లు గోస పడుతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో లక్ష్మినగర్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తెలంగాణ పచ్చని పంటలు, చిరునవ్వులతో కళకళలాడుతోందని, రైతులు కడుపునిండా తిని కంటినిండా నిద్రపోతున్నారని పేర్కొన్నారు. బీజేపీ బరితెగింపు దాడులు చేస్తూ తెలంగాణ ప్రగతికి అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. కరోనాకాలంలో కాంగ్రెస్‌గానీ, బీజేపీగానీ ప్రజలను పట్టించుకోలేదని, ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఓట్ల కోసం యాత్రల పేరుతో వస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇక్కడి ప్రజలకు అన్యాయం జరిగిందని, నీళ్లు, జేఎన్టీయూను మంథనికి తరలించుకుపోయారన్నారు. ముందుగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, రాష్ట్ర కార్యదర్శి మూల విజయ రెడ్డి, దాతు శ్రీనివాస్, అడ్డాల గట్టయ్య, కల్వచర్ల కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులు ప్రారంభం

రామగుండం: మన ఊరు – మన బడి కింద ఎంపికై పనులు పూర్తి చేసుకున్న అక్బర్‌నగర్‌లోని ఉర్దూ పాఠశాలలో తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆధునిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, పాఠశాల హెచ్‌ఎం ఫాతిమాబేగం ఉన్నారు.

మహనీయుల చరిత్ర చాటేందుకు కృషి

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు
- బొక్కలవాగు వంతెనపై బీపీ మండల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామని, వారి చరిత్రను చాటేందుకు కృషి చేస్తున్నామని, అందుకే మంథని ప్రాంతంలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పేర్కొన్నారు. గురువారం మంథనిలోని బొక్కలవాగు వంతెనపై బీపీ మండల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. బీపీ మండల్ ఆనాడు విద్య, రాజకీయాల్లో అనేక మార్పులు తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. బలహీన వర్గాల్లో చైతన్యం రాకపోతే బానిసలుగానే బతకాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ సభ్యురాలు తగరం సుమలత, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

జన చైతన్య యాత్ర పుస్తకావిష్కరణ

జెడ్పీ చైర్మన్ మధు తన నివాసంలో సీపీఎం జన చైతన్య యాత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక, కర్షక, నిరుపేద ప్రజలపై దాడి మొదలు పెట్టిందని ఆరోపించారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ రైతు, విద్యుత్ వ్యతిరేక చట్టాలను తీసుకువస్తోందన్నారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తూ కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని మండిపడ్డారు. జన చైతన్య యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కుమారస్వామి, మహేశ్వరి, జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ తదితరులున్నారు.

'అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరు'



శివుపల్లిలోని ఇంట్లో విజయరమణారావు నిర్బంధం

ఎలిగేడు(పెద్దపల్లి): రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, యువత, విద్యార్థుల కోసం పోరాటం చేస్తున్న ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కలేరని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం సిట్ విచారణకు హాజరు కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్ తరలిరావాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. విజయరమణారావును హైదరాబాద్ వెళ్లకుండా మండలంలోని శివపల్లిలో గల ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌తోపాటు ప్రతీ విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో గ్రూప్స్‌కు సంబంధించిన అన్ని ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని అన్నారు. కేసును సీబీఐకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, దుగ్యాల శ్వేత, సింగిరెడ్డి ఎల్లవ్వ, చీకురాయి ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచు కొండ తిరుపతిగౌడ్ ఉన్నారు.

ప్రజా సమస్యలు పట్టని పాలకులు

జూలపల్లి(పెద్దపల్లి): ప్రజల సమస్యలను గాలికొదిలేసి, అరెస్టులు, నిర్బంధాలతో పాలకులు కాలం వెల్లదీస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా గురువారం జూలపల్లి మండలంలోని వడ్కాపూర్‌లో ఇంటింటా విజ్జన్న పేరుతో పాదయాత్ర నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిందన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్లే పేపర్ల లీకేజీ, పరీక్షలు రద్దవుతున్నాయని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే సొంత ప్రయోజనాలు తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. నాయకులు మామ్కాళి అంజయ్య, కనకట్ల నర్సింగం, తిరుపతి ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): సీఎం కేసీఆర్ మరోసారి రైతు బాంధవుడని నిరూపించుకున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వడగండ్లతో పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.10 వేల పరిహారం ప్రకటించడం హర్షణీయమన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు పబ్బం గడుపుకునేందుకు అసత్యపు ప్రచారాలు చేస్తాయని విమర్శించారు. రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు అనంత రెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ బుర్ర మౌనిక, వైస్ ఎంపీపీ కోట స్వప్న పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలను గ్రామస్థాయిలో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనుబంధ, కుల, మహిళ, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

పెద్దపల్లిరూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీఎం కేసీఆర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో నష్టపోయిన పంటల పరిశీలనకు వచ్చిన సీఎంను కలిసి, పెద్దపల్లి నియోజకవర్గంలో పంట నష్టం వివరాలను అందించినట్లు పేర్కొన్నారు.

'రెండు దశాబ్దాల్లో ఏం చేశావ్..?'



మాట్లాడుతున్న కౌశిక్ హరి

గోదావరిఖని: రెండు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధిగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఈ ప్రాంతానికి ఏం చేశారని బీజేపీ నేత కౌశిక్ హరి ప్రశ్నించారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్‌గా ఆరేళ్లు, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. రాజీవ్ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉన్నా.. ఎమ్మెల్యేగా ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. రూ.కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ప్రజల సొమ్ము వృథా చేశారని విమర్శించారు. కూరగాయల మార్కెట్, మున్సిపల్ భవనం ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేతో కుమ్మక్కై అనేక పనులు చేయించుకుంటున్నారని విమర్శించారు. థర్మల్ ప్లాంట్ వస్తే ఈప్రాంత ప్రజలకు అన్ని రకాలుగా మేలు జరిగే అవకాశం ఉండేదన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ ఏ సమస్యలపై మాట్లాడారని ప్రశ్నించారు. అసమర్థ నాయకుడు కాబట్టే అధిష్టానం అతని నుంచి జిల్లా అధ్యక్షుడిగా రాజీనామా తీసుకుందన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పనిచేశానని చెప్పుకొచ్చారు. పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న సత్యనారాయణకు తనను విమర్శించే అర్హత లేదన్నారు. ఆయన వెంట నాయకులు సుల్వ లక్ష్మీనారాయణ, మూకిరి రాజు, మహావాది రామన్న, రవీందర్‌రెడ్డి, కళ్యాణ్, శశికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కేసు సీబీఐకి అప్పగించాలి



అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు సీబీఐకి అప్పగించాలని బహుజన సమాజ్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట పార్టీ నాయకులతో కలిసి, నిరసన తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. సీఎం కేసీఆర్ అసమర్థ పాలన వల్లే అవినీతి అధికారులు ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబీకులే నిరుద్యోగ యువతకు జవాబు చెప్పాలన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సిట్‌కు అప్పగించి, దోషులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఈ కేసును సీబీఐకి అప్పగించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆమరణ దీక్షకు దిగడం వల్లే ప్రభుత్వం పరీక్షలను రద్దు చేసిందన్నారు. నిరుద్యోగులకు మద్దతుగా తమ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. నాయకులు చంద్రశేఖర్, సవిత, వెంకటేశ్, శేషాద్రి, బాబు, దుర్గయ్య, రవికుమార్, గోపాల్, అనిల్, శారద, శోభ, రాజబాబు, రంజిత్, ప్రశాంత్, మధు, నర్సయ్య, అరుణ, శారద, అంజయ్య తదితరులున్నారు.

జిల్లాస్థాయిలో 27 ఉత్తమ పంచాయతీలు ఎంపిక

- ఈ నెల 25న మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా సత్కారం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఒక్కో అంశంలో మంచి ప్రతిభ కనబర్చిన 27 ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేశారు. నిర్దేశించిన 9అంశాలతో నామినేషన్ వేసిన గ్రామాల్లో ఒక్కో అంశంలో ప్రతిభ కనబర్చిన మూడు చొప్పున పంచాయతీలను ఎంపిక చేశారు. ఆయా పంచాయతీ పాలకులకు ఈనెల 25న కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ సంగీత చేతుల మీదుగా ప్రశంసపత్రాలను అందించనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగేలా పంచాయతీలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదరికంలేని మెరుగైన జీవనోపాధి: చీకురాయి, ముత్తారం, ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్.

ఆరోగ్యకరమైన పంచాయతీ: ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, మంథని మండలం నాగారం, రామగిరి మండలం నాగేపల్లి.

పిల్లల స్నేహపూర్వకం: కమాన్‌పూర్ మండలం జూలపల్లి, ఓదెల మండలం భీమారంపల్లి, పెద్దపల్లి మండలం పెద్దకల్వల.

నీటి సమృద్ధి: జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి, కమాన్‌పూర్ మండలం జూలపల్లి, శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్.

పరిశుభ్రమైన పచ్చదనం: ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, మంథని మండలం నాగారం. రామగిరి మండలం నాగేపల్లి.

స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు: ధర్మారం మండలం కటికనపల్లి, రామగిరి మండలం రత్నాపూర్, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి.

సామాజిక భద్రత: ముత్తారం మండలం ఓడేడు, ఓదెల మండలం ఉప్పరపల్లి, శ్రీరాంపూర్ మండలం గంగారం.

సుపరిపాలన: ధర్మారం, రామగిరి మండలం నాగేపల్లి, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి.

మహిళా స్నేహపూర్వక పంచాయతీ: ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, మంథని మండలం చిల్లపల్లి, సుల్తానాబాద్ మండలం సుద్దాల.